## క్లుప్తంగా

### పాఠశాల ప్రాంగణంలో మురికిని తొలగించాలి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల ప్రాంగణంలో మురికి నీటిని తొలగించాలని, మురికి వల్ల దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నాయని పాఠశాల నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం మండల పరిషత్‌లో ప్రత్యేకాధికారి వేంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల పక్కన ఉన్నటువంటి బైక్ షోరూంలో వాహనాలు కడిగిన నీళ్లు పాఠశాల ప్రాంగణంలోకి వస్తున్నాయన్నారు.

### వేతనాలు చెల్లించాలి

బాన్సువాడ : బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో



కార్మికులకు బకాయిపడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు అన్నారు. మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఏజెన్సీ కాంట్రాక్టర్‌చే వేతనాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులందరికి పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు కుమురొద్దీన్, సంతోష్‌గౌడ్, రేణుక తదితరులున్నారు.

### ఎండీఎం నిర్వాహకులకు సౌకర్యాలు కల్పించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎండీఎం నిర్వాహకులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ ఎండీఎం నిర్వాహకులు మంగళవారం ఎంఈవో వెంకటేశంకు వినతిపత్రం సమర్పించారు. ఎండీఎం నిర్వాహకులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. దీని విషయమై ఎంఈవోకు సమ్మె పత్రాన్ని అందించారు.కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకులు సాయిలు, దుర్గవ్వ, సాయవ్వ తదితరులున్నారు.

### సిద్దిపేటలో పర్యటించిన తెయూ విద్యార్థులు



భిక్కనూరు : తెయూ దక్షిణ ప్రాంగణం విద్యార్థులు మంగళవారం సిద్దిపేటలో పర్యటించారు. యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థలను వారు పరిశీలించారు. నెహ్రూ యువకేంద్రం, అభయజ్యోతి స్వచ్ఛంద సంస్థలను పరిశీలించారు. ఎన్‌వైకే జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు రాజలింగం, కిరణ్, రంజిత్‌రెడ్డి, మానస, దీప్తి, ఎంఎస్‌డబ్ల్యూ ఫస్టియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

### మాలమహానాడు నూతన కార్యవర్గం



రాములు, అధ్యక్షుడు

దోమకొండ : మాల మహానాడు నూతన మండల కార్యవర్గంను మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దోమకొండ మండల కేంద్రానికి చెందిన పిప్పిరి రాములు, ఉపాధ్యక్షుడిగా ముత్యంపేటకు చెందిన బత్తిని వెంకటేషం, కోశాధికారిగా అంచనూరుకు చెందిన జీడి సత్యనారాయణ, సలహాదారులుగా అంబారిపేటకు చెందిన ప్రభాకర్, సంఘమేశ్వర్‌కు చెందిన రాజు, దోమకొండకు చెందిన పృథ్వీరాజ్, ప్రశాంత్, చింతమాన్‌పల్లికి చెందిన వినోద్‌ను ఎన్నుకున్నారు.

### మేరు సంఘం..



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం మేరు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగు దశరత్, ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం, స్వామి, సాయికుమార్, బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల భాస్కర్, కోశాధికారిగా సంగు గంగాధర్, కార్యదర్శులుగా రాజేందర్, సంగు శంకర్, రవి, మదు, రాజు, నిర్వాహణ కార్యదర్శులుగా సుధాకర్, రవి, స్వామి, రాజు, భూమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# పబ్లిక్ టాయిలెట్లకు మోక్షమెప్పుడో..?

- ప్రతి జీపీ నుంచి రూ. 20వేల డీడీలు
- బస్టాండ్లలో ప్రయాణికులకు అవస్థలు
- ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీ
- మరుగుదొడ్లు, నీటి వసతి కరువు



నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని బస్టాండ్

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నియోజకవర్గాల్లోని ప్రతి బస్టాండ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, ప్రతి జీపీ నుంచి అధికారులు రూ. 20 వేల డీడీలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీపీలు కట్టించారు. జిల్లా వ్యాప్తంగా 526 పంచాయతీలు ఉండగా అందులో 326 గ్రామ పంచాయతీలు డీడీలు తీశాయి. వీటిల్లో బిచ్కుంద, భిక్కనూరు, కామారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి, ఎల్లారెడ్డి, మండలాల్లో పూర్తి గ్రామాలు డీడీలు తీశాయి. నస్రుల్లాబాద్ మండలంలో 11 గ్రామాలు డీడీలు తీశాయి.

**ప్రాంగణాల్లో ఇబ్బందికర పరిస్థితి..**

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఉన్న ప్రయాణ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల నుంచి నిజామాబాద్, బాన్సువాడ, బోధన్, హైదరాబాద్, జగిత్యాల్, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, బీదర్, ఉద్గీర్ తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే నస్రుల్లాబాద్‌కు రావాల్సిందే. జిల్లా కేంద్రాలకు మాత్రమే కాకుండా వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన కూడలిగా ఉంటుంది. హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లాలంటే రాత్రిళ్లు ప్రయాణికులు ఎదురు చూస్తూ ఉంటారు. కాని కనీస అవసరాలను తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

**అత్యవసర పరిస్థితిలో ఇబ్బందులు..**

ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టినప్పటి నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. విద్యా, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉన్న తమ పిల్లలను కలవడానికి వారంలో ఒకరోజు తల్లులు వెళ్తున్నారు. కాని అత్యవసర పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, బస్టాండ్లలో కుర్చీలు కూడా సరిగ్గా లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

**తిరిగి ఇచ్చేస్తామన్నారు..**

గతంలో కమ్యూనిటీ టాయిలెట్ల కోసం ప్రతి జీపీ నుండి డీడీలు చెల్లించారు. వీటిపై ఉన్నతాధికారులకు నివేదించగా స్కీం రద్దయిందని డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని చెప్పారు. ఇంకా రాలేదు. జీపీలు తీర్మాణం చేసుకుంటే స్వచ్ఛభారత్‌లో భాగంగా వర్క్ డిమాండ్ పెట్టుకుని మరుగుదొడ్లు నిర్మించుకోవచ్చు. డీడీల డబ్బులు రాగానే జీపీల ఖాతాల్లో జమ చేస్తాము. – రాము, ఎంపీవో, నస్రుల్లాబాద్

# గృహజ్యోతి వివరాల సేకరణ





ఎల్లారెడ్డిలో కరెంట్ మీటర్‌కు ఆధార్, రేషన్ కార్డ్‌ను లింక్ చేస్తున్న అధికారులు, మద్నూర్‌లో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం ఇంటింటికి గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ మీటర్లకు ఆధార్, రేషన్ నెంబరును లింక్ చేశారు. పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ శాఖ అధికారులు తిరిగి విద్యుత్ మీటర్లు ఉన్న వారికి సంబంధించి ఆధార్, రేషన్ నెంబర్లను లింక్ చేశారు. తెలుపు రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఒక కుటుంబంలో ఒకరికి గృహజ్యోతి పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ గణేశ్, ఏఈ సత్యనారాయణ, సిబ్బంది తదితరులున్నారు.

**మద్నూర్‌లో..**

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో మంగళవారం ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది గృహజ్యోతికి సంబంధించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ అరవింద్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు తెలిపితే విద్యుత్ మీటర్‌కు అనుసంధానం చేస్తామని ఆయన అన్నారు.

# పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా జరగాలి



రాజంపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకిషన్



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం

రాజంపేట : మండలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని మండల ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్తు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బుధవారం నుంచి ఈనెల 14వ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, ఏపీవో భాస్కర్ లు పాల్గొన్నారు.

**నస్రుల్లాబాద్‌లో..**

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలో ప్రతి గ్రామంలో పారిశుధ్యలోపం లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు, స్పెషల్ ఆఫీసర్లకు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, గిర్దావార్ అంజు, ఎంపీవో రాము, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

**నేటి నుంచి స్పెషల్ డ్రైవ్**

గాంధారి(ఎల్లారెడ్డి) : నేటి నుంచి ఈ నెల 15 వరకు గ్రామ పంచాయతీ పరిధిల్లో శానిటేషన్ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో బాగంగా గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వీధులను శుభ్రపర్చడం తడి పొడి చెత్తలను శుభ్రం చేయడం, మురికి కాలువల నిర్వహణ, గ్రామాల్లో మురికి నీటి గుంతలను గుర్తించి శుభ్రం చేయడం, వీధుల్లో రోడ్లపై గుంతలు పూడ్చి వేయడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద మంగళవారం టీపీటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో మండల విద్యాధికారి దేవిసింగ్ చేతుల మీదుగా విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ఖమ్మంలో జరిగే రెండో విద్యా వైజ్ఞానిక మహా సభల వాల్ పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించామన్నారు. టీచర్లు గణపతి, కృష్ణమూర్తి, రూప్‌సింగ్, నాగభూషణం, రమేశ్, శ్రీధర్ రెడ్డి, కృష్ణ తదితరులున్నారు.

### క్యాలెండర్లు..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో కా ర్యాలయం ఆవరణలో ఎంపీపీ రాజ్‌దాస్, తహసీల్దార్ లక్ష్మణ్, జాతీ య బీసీ సంక్షేమ సంఘం నాయకులు నారాయణ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

### ఎస్‌ఎంసీ చైర్మన్‌కు సన్మానం



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌ఎంసీ చైర్మన్ మిడుత సాయిలును ఘనంగా సన్మానించారు. ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌గా సాయిలు అందించిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ నాయకులు విజయ్‌కుమార్, రామాగౌడ్, మైత్రి. సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.

# బాల్క సుమన్‌పై భగ్గుమన్న కాంగ్రెస్





లింగంపేటలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మహమ్మద్‌నగర్‌లో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రఫియొద్దిన్, నాయకులు గోవింద్, ఫతియొద్దిన్, సిద్దు, రాంరెడ్డి, జొన్నల రాజు తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు బాల్కసుమన్ దిష్టిబొమ్మను దాహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్,రవీందర్‌రెడ్డి, మల్లయ్యగారి. ఆకాశ్, లోక్యానాయక్,సవాయిసింగ్ తదితరులున్నారు.

భిక్కనూరు : మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి రాజు, కామారెడ్డి జిల్లా ప్లానింగ్ కమిటీ చైర్మన్ బైండ్ల దశరథం, మండల కార్యదర్శి భూపాల్ ఉన్నారు.

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు బాల్కసుమన్ వ్యాఖ్యలకు నిరసనగా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు తలారి ప్రభాకర్, నర్సయ్య, స్వామి, నవీన్, దాకయ్య, శ్రీను పాల్గొన్నారు.

బిచ్కుంద(జుక్కల్) : మరోసారి బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, కమల్‌కిషోర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, గంగాధర్, పాషా, నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరు పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు.

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోడ్ల రాజు, షకీల్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : మండలంలోని బసవన్న పల్లి గ్రామంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సభాకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, శశికాంత్ రెడ్డి సంజీవ రెడ్డి,సహదేవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిలు, రమేశ్, కుషాల్, రవి, గోపి, సంతోష్, హన్మండ్లు, పప్పుసేట్ తదితరులున్నారు.

# విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

కామారెడ్డి అర్బన్ : విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వివిధ ప్రాంతాలు, ప్రజలతో మమేకం కావడం ద్వారా నిజజీవితంలో ఎలా ఉండాలో సమాజం నేర్పుతుందని నాయకత్వ లక్షణాలు అలవాడుతాయని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే విజయ్‌కుమార్ అన్నారు. వారం రోజులుగా మండలంలోని లింగాయపల్లిలో నిర్వహిస్తున్న కళాశాల జాతీయ సేవా పథకం శీతాకాల ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ సమన్వయకర్త వి శంకర్, ప్రోగ్రాం అధికారి జి చంద్రశేఖర్‌గౌడ్, లింగాయపల్లి పాఠశాల హెడ్‌మాస్టర్ శాంత తదితరులు పాల్గొన్నారు.

### వీధి వ్యాపారులకు రుణాలివ్వాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : వీధి వ్యాపారులు బ్యాంకు నుంచి లభించే రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బ్యాంక్ అధికారులతో కలిసి వీధి వ్యాపారులకు సమావేశం నిర్వహించారు. గతంలో రూ. 20 వేల రుణం పొంది సక్రమంగా రుణాన్ని చెల్లించిన వారు రూ. 50 వేల రుణానికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ పవన్, సిబ్బంది తదితరులున్నారు.

### నీటిని పొదుపుగా వాడాలి



బాన్సువాడ రూరల్ : నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరుతూ మంగళవారం మండలంలోని కొల్లూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి కుళాయిలకు తప్పకుండా బిరడాలు బిగించుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ ఒక ఇంకుడు గుంత నిర్మించుకుంటే భూగర్భ జలాలు సమృద్ధిగా పెంపొందుతాయన్నారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ప్రోగ్రాం ఆఫీసర్ మద్ది గంగాధర్, రమ్యశ్రీ, వలంటీర్లు పాల్గొన్నారు.

### ఉత్తమ పేరెంట్‌కు ప్రశంసాపత్రం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి జెడ్పీ బాలికల పాఠశాల ఉత్తమ పేరెంట్‌గా ఎంపికైన యశ్వంత్ పవార్‌కు ఎంఈవో వెంకటేశం మంగళవారం ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు. గతంలో నిర్వహించిన విద్యా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ పేరెంట్‌కు ఎంపికైన యశ్వంత్ పవార్‌ను ప్రశంసాపత్రం అందించారు.

### యాసంగి పంటల పరిశీలన



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఏడీఏ

గాంధారి(ఎల్లారెడ్డి) : మండలంలోని పోతంగల్ కలాన్ గ్రామాన్ని మంగళవారం ఎల్లారెడ్డి ఏడీఏ రత్న సందర్శించి యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, వరి పంటలను పరిశీలించినట్లు ఏవో నరేశ్ తెలిపారు. పంటలను కాండంతొలిచే పురుగు, కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించి నివారణకు సంబందిత రైతులకు పలు సూచనలు సలహాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, ఏఈవోలు ఉన్నారు.

### రూరల్ సీఐగా రామన్



కామారెడ్డి క్రైం : కామారెడ్డి రూరల్ సీఐగా ఎస్ రా మన్ బదిలీపై వచ్చారు. మొన్నటివరకు సదాశివనగర్ సీఐగా పనిచేసిన ఆయన ఇటీవల జరిగిన బ దిలీల్లో ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. తాజాగా రూరల్ సీఐగా నియమితులయ్యారు. మంగళవారం ఆయన రూరల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన శ్రీనివాస్ ఐజీ కార్యాలయానికి రిపోర్ట్ చేశారు.

### ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమీషనర్ జగ్జీవన్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ ఇంటి పన్నులను వసూలు చేశారు. ప్రతిఒక్కరు ఇంటి పన్నులను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు.

## ఆధ్యాత్మికం

### రేణుకా ఎల్లమ్మ ఆటో యూనియన్ ఏర్పాటు



భిక్కనూరు : రేణుకా ఎల్లమ్మ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తడకల వెంకట్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బండి రవీందర్, క్యాషియర్‌గా పుల్లూరి స్వామి, సభ్యులుగా సత్యనారాయణ, తిర్మలయ్య, రమేష్, రాంచంద్రం తదితరులు ఎన్నికయ్యారు.

**కొనసాగుతున్న ఉత్సవాలు**



రాజంపేట : రాజంపేట మండలం బస్వన్నపల్లిగ్రామంలో గొల్ల కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం రేణుక ఎల్లమ్మ కళ్యాణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం ఊరేగింపుగా బోనాలను అమ్మవారి వద్దకు చేర్చారు. అమ్మవారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకను తిలకించారు.

**విఠలేశ్వర ఆలయానికి భూమిపూజ**



మద్నూర్(జుక్కల్) : మండలంలోని కోడిచిరలో విఠలేశ్వర ఆలయ నిర్మాణానికి మంగళవారం కథ్‌గావ్ పీఠాధిపతి మల్లికార్జున్ స్వామి మహారాజ్ భూమిపూజ చేశారు. గ్రామంలోని దళితవాడలో గ్రామస్తులు అందరు కలిసి మల్లికార్జున్ స్వామి చేతుల మీదుగా భూమిపూజ, శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంగమేశ్వర్, సంతోష్ పటేల్ తదితరులున్నారు.

## సంక్షిప్తం

**పాలకవర్గానికి సన్మానం..**



మాచారెడ్డి : మండలంలోని మైసమ్మ చెరువు తండా సర్పంచ్ సంతోష్, ఉపసర్పంచ్ పంతులు నాయక్‌లతో పాటు వార్డు సభ్యులను మంగళవారం గ్రామ యువకులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో యువకులు మహేష్, సతీష్, బాలు, వెంకటి ఉన్నారు.

**శానిటేషన్ డ్రైవ్‌ను సక్సెస్ చేయాలి**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఎంపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ ఈఎంఐలు, కరెంటు బిల్లులు, సిబ్బంది వేతనాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఈనెల 7 నుంచి 14 వరకు నిర్వహించే స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో మురికి కాలువలు, వీధులను శుభ్రం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

**దస్తావేజు లేఖరులకు లైసెన్సులు అందించాలి**



ఎల్లారెడ్డి: దస్తావేజు లేఖరులకు ప్రభుత్వం లైసెన్సులు ఇవ్వాలని కోరుతు దస్తావేజు లేఖరులు మంగళవారం ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ అఫ్జల్ నూర్ ఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. గతంలో దస్తావేజు లేఖరులకు లైసెన్సులు ఉండేవని వాటిని పునరుద్ధరించాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో కరీం, ముక్రమ్ తదితరులున్నారు.

**భవిత సెంటర్‌ను వినియోగించుకోవాలి**

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో భవిత సెంటర్‌ను ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ మనీషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వికలాంగ చిన్నారులకు పరీక్షలు చేసి ఇంటి వద్ద చేయాల్సిన వ్యాయమాలను చూపించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హన్మాండ్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఆలయ దుకాణాలకు బహిరంగ వేలం**

మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్‌లో ప్రసిద్ధి చెందిన హనుమాన్ ఆలయ పరిసరాల్లోని పూజా సామగ్రి దుకాణానికి ఈ నెల 8న బహిరంగ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది వేణు తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి ఉన్న పూజా సామగ్రి దుకాణానికి గురువారం ఆలయంలో ఉదయం పదకొండు గంటలకు వేలం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాట సమయానికి 2 గంటల ముందు రూ. 10 వేల డిపాజిట్ చేయాలన్నారు.

**విద్యుత్ సరఫరాకు అంతరాయం**

బీబీపేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు తుజాల్‌పూర్, యాడారం, శేరిబీబీపేట, మల్కాపూర్. శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో ముదున్నర గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.